సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 26 । జూన్ । 2023



విజేత ఇటుకలపల్లి

సత్యసాయి, ఫాదర్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ స్మారక టోర్నీ ముగిసింది. ఇటుకలపల్లి జట్టు విజయం సాధించింది. 8లో



నేటి నుంచి రెండు పూటలా బడులు

సోమవారం నుంచి రెండుపూటలా బడులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

గరిష్టం/కనిష్టం
35.2°/ 22.4°

జిల్లాలో ఆదివారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల వర్షం పడింది. వాతావరణం చల్లబడింది.

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తామన్నారు. డివిజన్, మండల స్థాయిలో సైతం స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు.

పీఏబీఆర్‌లో తగ్గిపోతున్న నీటి మట్టం



జలాశయంలో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం తగ్గిపోయింది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో ఏమాత్రమూ లేదు. ఆదివారం నాటికి డ్యాంలో 2.88 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. ధర్మవరం కుడి కాలువకు రోజూ 154 క్యూసెక్కులు, అనంతపురం, సత్యసాయి, శ్రీరామిరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు 55 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఇన్‌ఫ్లో లేనందున నీటి మట్టం తగ్గుముఖం పడుతూ వస్తోందన్నారు. తాగునీటి ప్రాజెక్ట్‌లకు నీటి కొరత లేదని, 1.5 టీఎంసీలు నీరు ఉన్నా చాలన్నారు.

ఆర్ఐ విష్ణుపై సస్పెన్షన్ వేటు

అనంతపురం అర్బన్: భూ వివాదంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అనంతపురం రూరల్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విష్ణుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని కమలానగర్‌లో నివాసముంటున్న తుమ్మల వంశీ ఈ నెల 16న ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. కురుగుంట గ్రామ పొలం సర్వే నంబరు 102/113లో తన భార్య పేరున ఉన్న 5.68 ఎకరాల పొలాన్ని కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి తమదంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారంటూ వంశీ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. బెదిరింపులకు పాల్పడిన వారి పేర్లతో పాటు ఆర్ఐ విష్ణు పేరునూ తన సూసైడ్ నోట్‌లో ప్రస్తావించాడు. ఈ వ్యవహారంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ మధుసూదన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆయన ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఆర్ఐ విష్ణును సస్పెండ్ చేశారు.


టీడీపీ కార్యక్రమంలో టీచర్



టీడీపీ నేతలు పరిటాల సునీత, పార్థసారథి తదితరులతో సిద్దయ్య

పెనుకొండ రూరల్: ఆయనో ప్రభుత్వ ఉపాధ్యాయుడు. నిబంధనల ప్రకారం ఏ రాజకీయ పార్టీతోనూ అంటకాగకూడదు. పార్టీలు నిర్వహించే కార్యక్రమాల్లో పాలు పంచుకోకూడదు. కానీ, తనకలాంటివేవీ పట్టవన్నట్లు వ్యవహరించారు. ఆదివారం పెనుకొండ మండలంలోని శెట్టిపల్లికి చేరిన టీడీపీ బస్సు యాత్రలో ఉపాధ్యాయుడు సిద్దయ్య పాల్గొనడం చర్చనీయాంశమైంది. రొద్దం మండలంలోని కంచిసముద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆయన.. టీడీపీ నాయకులను సాదరంగా ఆహ్వానించడమేకాక తన పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించడంపై పలువురు విమర్శలు గుప్పించారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి రాజకీయ పార్టీ కార్యక్రమంలో హల్‌చల్ చేయడం చూసి ముక్కున వేలేసుకున్నారు. ఈ విషయంపై రొద్దం ఇన్‌చార్జ్ ఎంఈఓ అంజినాయక్ 'సాక్షి'తో మాట్లాడుతూ ఉద్యోగులు రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా వ్యవహరించాల్సి ఉందన్నారు. సిద్దయ్య అంశాన్ని ఉన్నతాధికారులకు నివేదించి, వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాడెద్దుల సవ్వడి..



పుట్టపర్తి సమీపంలోని ఓ పొలంలో కాడెద్దులతో వేరుశనగ విత్తు

కరువుకు కవలగా చంద్రబాబును వర్ణిస్తారు. ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగినన్నాళ్లూ వరుణుడు ముఖం చాటేయడమే అందుకు కారణం. దీంతో అప్పట్లో సాగు పనుల్లేక కాడెద్దులను రైతులు తెగనమ్మారు. టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో గ్రామానికి ఒకటి, రెండు కాడెద్దులు, ఎండ్ల బండ్లు ఉన్నాయంటేనే ఎక్కువగా ఉండేది. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నాలుగేళ్ల క్రితం వరకూ తిరోగమన దిశలో పయనించిన పంటల సాగు.. వరుణుడి కరుణతో నేడు జోరుగా సాగుతోంది. పెరిగిన ఇంధన ధరలతో యంత్రాల బాడుగ ధరలు పెరగడంతో రైతులు ఎడ్ల బండ్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో కాడెద్దుల సవ్వడి గ్రామాల్లో మళ్లీ జోరుగా వినపడుతోంది.

- జిల్లాలో పెరిగిన కాడెద్దుల సంఖ్య
- గతంలో వ్యవసాయ పనులు లేక తెగనమ్ముకున్న రైతులు
- ప్రభుత్వ ప్రోత్సాహం, వరుణుడి కరుణతో జోరుగా 'సాగు'
- ఈ క్రమంలోనే పెరిగిన ఎడ్ల బండ్లు
- పెరిగిన ఇంధన ధరలతోనూ కాడెద్దుల వైపు దృష్టి

పుట్టపర్తి అర్బన్: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రకృతి కరుణించింది. విస్తారంగా వర్షాలు కురిశాయి. చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు పెరిగాయి. పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. రైతులను పథకాలతో సీఎం ఆదుకుంటున్నారు. దీంతో సాగు పనులకు కాడెద్దుల డిమాండ్ పెరిగింది. విత్తనం మొదలు, పొలం దున్నడానికి, దంతులు పట్టడానికి, గుంటక పాయడానికి, పురుగు మందుల పిచికారీ సమయంలో నీళ్ల పొలాలకు తీసుకెళ్లేందుకు, మేత తీసుకు రావడానికి, పంట ఉత్పత్తులు కల్లాలకు చేర్చడానికి, ఇంటి పనులకు, ఇతర ప్రాంతాల నుంచి గడ్డి తరలించడానికి ఇలా ఎన్నో పనులు చేసేందుకు కాడెద్దుల సాయం అనివార్యమవుతోంది. దీంతో జిల్లాలో ఏ గ్రామంలో చూసినా రైతుల ఇంట కాడెద్దుల గంటల శబ్దం మారుమోగుతోంది.

పెరిగిన ఇంధన ధరలూ కారణమే..

ఎన్నడూ లేని విధంగా కొన్ని రోజులుగా డీజిల్, పెట్రోలు ధరలు ఆకాశాన్నంటాయి. వ్యవసాయ పనులకు యంత్రాల బాడుగలు కొండెక్కాయి. చిన్న పనికి సైతం ట్రాక్టర్, రోటోవేటర్ తదితర యంత్రాలకు వేలాది రూపాయల బాడుగ చెల్లించాల్సిన పరిస్థితి. కాడెద్దుల వరకూ వస్తే అలాంటి పరిస్థితే ఉండదు. ఒక్క సారి కొనుగోలు చేస్తే కనీసం పదేళ్ల పాటు నమ్మకంగా పని చేస్తాయి. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గడ్డి కొరత కూడా నేడు లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా జీవాల ఆరోగ్యమే లక్ష్యంగా పశువైద్య శాలలు, సంచార వైద్య శాలలు ఏర్పాటు చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా వైద్య సిబ్బందిని గ్రామాల్లోనే అందుబాటులోకి తెచ్చింది. దీంతో మళ్లీ రైతులు కాడెద్దుల వైపు దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది.



ధర్మవరం సమీపంలో ఎడ్ల బండిలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

ప్రభుత్వ ఇతర పనులకూ..

గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వేలసంఖ్యలో ఇళ్లు మంజూరు చేసి కొత్త ఊళ్లనే నిర్మిస్తోంది. జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లకు ప్రభుత్వం ఎడ్లబండ్ల ద్వారా ఉచితంగా ఇసుక తోలుకోవడానికి అనుమతులిచ్చింది. ట్రాక్టర్ ఇసుక తోలేందుకు యజమానులు ఎక్కువగా డబ్బు అడుగుతుండడంతో ఇళ్లు కట్టుకునే వారు కాడెద్దులు ఉన్న రైతులనే సంప్రదిస్తున్నారు. ఎడ్లబండి ద్వారా ఇసుక తోలుకుంటే బాడుగ చాలా తక్కువవుతుండడంతో వాటికి డిమాండ్ పెరిగింది. జిల్లాలో చిత్రావతి, పెన్నా, హగరి, కుషావతి నదులతో పాటు అటవీ ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో ఇసుక మేట వేయడంతో విరివిగా లభిస్తోంది. దీంతో వ్యవసాయ పనుల బాడుగలకే కాకుండా ఇసుక తోలుకుంటూ కూడా ఎడ్ల బండ్ల రైతులు ఆదాయం పొందుతున్నారు.

18 వేలకు పైగా..

ప్రస్తుతం జిల్లాలోని 32 మండలాల్లో 18 వేలకు పైగా కాడెద్దులు ఉన్నాయి. పుట్టపర్తి, ధర్మవరం,బత్తలపల్లి, ముదిగుబ్బ, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, రొద్దం, గోరంట్ల, కొత్తచెరువు, బుక్కపట్నం, సీకేపల్లి మండలాల్లో అత్యధికంగా ఉన్నాయి. జిల్లాలో ఈ ఏడాది 3 లక్షల హెక్టార్లకు పైగా ఖరీఫ్ పంటలు సాగవుతాయని అధికారుల అంచనా. కొద్దిరోజులుగా వర్షాలు పడుతున్నాయి. కొందరు రైతులు సాగు పనులు మొదలుపెట్టారు. దీంతో కాడెద్దులకు గిరాకీ పెరిగింది.

నియోజకవర్గం	ఎడ్ల బండ్లు
ధర్మవరం	5,850
పుట్టపర్తి	3,730
హిందూపురం	2,240
పెనుకొండ	1,600
మడకశిర	1,820
కదిరి	1,710
రాప్తాడు	1,050
మొత్తం	18,000

'మడకశిర'లో టీడీపీ బస్సుయాత్రకు బ్రేక్

- ఈరన్న నాయకత్వంలో సాగలేమని గుండుమల వర్గం స్పష్టీకరణ
- చేసేదిలేక కార్యక్రమాన్ని రద్దు చేసిన హై కమాండ్

మడకశిర: నియోజకవర్గంలో టీడీపీ బస్సుయాత్రకు బ్రేక్ పడింది. మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మధ్య కొనసాగుతున్న వర్గపోరే ఇందుకు కారణమని తెలిసింది. 'భవిష్యత్‌కు గ్యారంటీ' పేరుతో జిల్లాలో టీడీపీ నాయకులు బస్సుయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఈ యాత్ర మడకశిర నియోజకవర్గంలో మంగళవారం జరగాల్సి ఉంది. మండలంలోని కల్లుమర్రి నుంచి గుడిబండ వరకూ యాత్రను జరపడానికి హైకమాండ్ నిర్ణయించింది. షెడ్యూల్ కూడా విడుదల చేసింది.

ఈరన్న ఉంటే మేం రాం..!

టీడీపీ బస్సుయాత్ర కమిటీలో మాజీ ఎమ్మెల్యే ఈరన్నకు పార్టీ హైకమాండ్ చోటు కల్పించింది. ఆయన జిల్లా వ్యాప్తంగా జరిగే బస్సుయాత్రలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఈరన్న నియోజకవర్గ వ్యాప్తంగా బస్సుయాత్రలో పాల్గొంటే రాజకీయంగా తమకు నష్టం జరిగే అవకాశముందని గుండుమల తిప్పేస్వామి వర్గం భావించింది. దీంతో ఎలాగైనా సరే నియోజకవర్గంలో బస్సుయాత్ర జరగకుండా అడ్డుకోవాలని భావించిన గుండుమల వర్గం.. ఈరన్న పాల్గొనకుండా చూడాలంటూ టీడీపీ హైకమాండ్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. ఒకవేళ ఆయన ఆధ్వర్యంలోనే యాత్ర జరిపితే తాము పాల్గొనబోమని తేల్చిచెప్పినట్లు సమాచారం. నియోజకవర్గంలోని 5 మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు లేఖలో సంతకాలు చేసినట్లు తెలియవచ్చింది. దీంతో పార్టీ హైకమాండ్ చేసేది లేక నియోజకవర్గంలో బస్సుయాత్ర రద్దు చేసింది.

దళిత నాయకుల్లో అసంతృప్తి

పార్టీ హైకమాండ్ బస్సుయాత్రను రద్దు చేయడం పట్ల ఈరన్న వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఎస్సీ నియోజకవర్గంలో బీసీ నాయకుల పెత్తనమేంటని ఈరన్న వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఆయనను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి నుంచి కూడా తప్పించి బీసీ వర్గానికి చెందిన గుండుమల తిప్పేస్వామికి ఆ స్థానం కట్టబెట్టారు. దీంతో నియోజకవర్గంలోని దళితులు టీడీపీకి దూరమయ్యారని ఈరన్న వర్గీయులు వాపోతున్నారు. ప్రస్తుతం బస్సుయాత్ర కమిటీలో ఈరన్న పేరు ఉండడంతో యాత్ర మడకశిర నియోజకవర్గంలో జరగకుండా అడ్డుకోవడం తమను అవమానించడమేనని పలువురు దళిత నాయకులు స్పష్టం చేస్తున్నారు.

ప్రతి నీటి బొట్టూ ఒడిసిపట్టాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నోడలాఫీసర్ రాజేంద్రకుమార్ నేగి, కలెక్టర్ అరుణ్‌బాబు



పాపన్న కుంట గ్రామ సమీపంలో డ్రిప్ సిస్టంను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

- 'జల్‌శక్తి అభియాన్' నోడలాఫీసర్ రాజేంద్రకుమార్ నేగి

పుట్టపర్తి అర్బన్: భూగర్భజలాల పెంపే లక్ష్యంగా ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టాలని జల్‌శక్తి అభియాన్ పథకం సెంట్రల్ నోడలాఫీసర్ రాజేంద్రకుమార్ నేగి పేర్కొన్నారు. జిల్లాలో జల్‌శక్తి అభియాన్ కింద చేపట్టిన పనులను పరిశీలించడానికి విచ్చేసిన కేంద్ర బృందం ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన జల్‌శక్తి అభియాన్ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. మరిన్ని చోట్ల నీటి సంరక్షణ పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ, ఉద్యాన శాఖల పరిధిలో విస్తారంగా పండ్ల తోటలు సాగయ్యేలా చూడాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం జాయింట్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో జల్‌శక్తి అభియాన్ కింద చేపట్టిన పనులు, పురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పనుల ద్వారా భూగర్భ జలాలు బాగా పెరిగాయన్నారు. నాలుగేళ్ల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ప్రతి వ్యవసాయ బోరు నుంచి నీళ్లు వస్తున్నాయన్నారు. బావుల్లో వేసవి కాలంలో సైతం సమృద్ధిగా నీరు లభిస్తోందన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జల్‌శక్తి అభియాన్ పథకం కింద నీటి సంరక్షణ, వర్షం నీటి నిల్వ, సంప్రదాయ నీటి వనరులు, ట్యాంకుల పునరుద్ధరణ, వాటర్ షెడ్ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గతేడాది మార్చి 29 నుంచి ఇప్పటి వరకూ 6,138 పనులు చేపట్టి 3,295 పనులను పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. జిల్లా వర్షపాతం వివరాలు, జల్‌శక్తి అభియాన్ పనుల తీరు, హార్టికల్చర్ ప్లాంటేషన్, మైక్రో ఇరిగేషన్ తదితర అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డ్వామా, వ్యవసాయ, ఉద్యాన, అటవీ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల ద్వారా పురోగతిని వివరించారు. అనంతరం కేంద్ర బృంద అధికారులకు శాలువలు కప్పి సత్యసాయి బాబా చిత్రపటాలను అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రాఖీ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో కేంద్ర బృందం పర్యటన..

మూడు రోజుల పర్యటనకు విచ్చేసిన కేంద్ర బృందం అధికారులు ఆదివారం మధ్యాహ్నం పలు గ్రామాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. మామిళ్ల కుంట క్రాస్‌లోని సెరికల్చర్ ఫాంను పరిశీలించారు. జేడీ పద్మమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పాపన్న కుంట వద్ద చీని, మామిడి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. డ్రిప్ పద్ధతిపై ఆరా తీశారు. ఎంత కాలం నుంచి బోర్లు పని చేస్తున్నాయి, ఏఏ పంటలు సాగు చేస్తున్నారు అనే విషయాలను తెలుసుకున్నారు. మామిడి చెట్ల మధ్య ట్రెంచుల ఏర్పాటును పరిశీలించి అభినందించారు. అనంతరం కొత్తచెరువు మండలం లింగారెడ్డిపల్లిలో వారు పర్యటించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రామాంజనేయులు, డీపీఓ సుబ్బారావు, గ్రౌండ్ వాటర్ అధికారి రాజశేఖరరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డీఈఈ గంగాద్రి, డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులున్నారు.

- ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతుల నాగేపల్లి వద్ద ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసుకుంటున్న పండ్ల తోటలను ఆదివారం సెంట్రల్ టీం అధికారులు పరిశీలించారు. రైతు చంద్రమ్మ సాగు చేసిన చీనీ తోటను పరిశీలించి పలువురు రైతులతో మాట్లాడారు. అంతర పంటల సాగుపై ఆరా తీశారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం విరివిగా ప్రోత్సాహకాలు అందిస్తుండడం సంతోషకరమన్నారు. గతంలో వర్షాలు లేక ఉమ్మడి అనంతపురం జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. కార్యక్రమంలో ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి, క్షేత్ర సహాయకులు మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బిగుస్తున్న ఉచ్చు



- సిమెంట్ దొంగలపై క్రిమినల్ కేసుల నమోదుకు రంగం సిద్ధం
- ఆదేశించిన కలెక్టర్ అరుణ్‌బాబు
- నేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్న ఇంజినీరింగ్ అధికారులు
- పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించిన అనంతపురం కలెక్టర్
- ఎవరినీ ఉపేక్షించొద్దని స్పష్టం చేసిన కలెక్టర్లు

రాప్తాడురూరల్: శ్రీసత్యసాయి జిల్లాలో నాబార్డు స్కూళ్లు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో నిర్మాణ పనులకు కేటాయించిన సిమెంటును అక్రమంగా బ్లాక్‌మార్కెట్‌కు తరలించిన వ్యవహారంలో అక్రమార్కుల మెడకు ఉచ్చు బిగుసుకుంటోంది. సిమెంట్ దొంగల వ్యవహారాన్ని కలెక్టర్లు గౌతమి (అనంతపురం), అరుణ్‌బాబు (శ్రీసత్యసాయి జిల్లా) సీరియస్‌గా తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని పనుల పేరుతో సిమెంట్ స్కాం చేసినా... ఇదంతా అనంతపురంలోని సమగ్ర శిక్ష ఈఈ కార్యాలయం నుంచే నడిచింది. ఇరు జిల్లాల కలెక్టర్లు దీన్ని తీవ్రంగా పరిగణించారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో పాత్ర ఉన్న ఓ కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నారు. సిమెంట్ పక్కదారి వ్యవహారంలో ఏ స్థాయి ఉద్యోగి ఉన్నా ఉపేక్షించకూడదని, విచారణ పారదర్శకంగా చేపట్టి నివేదిక ఇవ్వాలని కలెక్టర్లు సమగ్ర శిక్ష ఏపీఓ సాయిరామ్, ఈఈ శివకుమార్‌లను ఆదేశించారు. విచారణలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు సైట్ ఇంజినీర్లు, ఆపైస్థాయి అధికారుల పాత్రపై పూర్తిగా దృష్టి సారించనున్నారు. చట్టపరమైన చర్యలతో పాటు పక్కదారి పట్టిన ప్రభుత్వ సొమ్ములో ప్రతి రూపాయినీ రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లాతో పాటు అనంతపురం జిల్లాలోనూ ఈ విధంగా ఏమైనా జరిగిందా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

అప్పుడే 90 శాతానికి పైగా పనుల పూర్తి..


ఉమ్మడి జిల్లాలో 57 నాబార్డు స్కూళ్లు, 17 కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో వివిధ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భవించేనాటికి దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. 70కి పైగా లోడ్ల సిమెంట్ బుక్ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి.

లాగిన్ బ్లాక్..

శ్రీసత్యసాయి జిల్లా డీఈ, ఈఈ పేర్ల మీద వచ్చిన కొత్త లాగిన్లను తమవద్ద ఉంచుకుని సిమెంట్ బుక్ చేసుకున్న ఉద్యోగుల వ్యవహారం వెలుగుచూడగానే ఆ లాగిన్‌ను బ్లాక్ చేశారు. అధికారులు ఆ లాగిన్‌ను ఓపెన్ చేసేందుకు వీలుకాలేదు. అయితే సిమెంట్ సరఫరా చేసిన కంపెనీల నుంచి వివరాలు తెప్పించుకుంటే ఈ అవినీతి తతంగమంతా వెలుగు చూస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఐదేళ్లకే నూరేళ్లూ నిండాయా కన్నా!

- పాముకాటుతో బాలుడి మృతి
- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు



మృతి చెందిన యశ్వంత్

బత్తలపల్లి: 'నిత్యం మాముందు ఎంతో ఆనందంగా ఉంటుంటివే. అలాంటి నిన్ను తీసుకుపోయేందుకు ఆ దేవుడికి చేతులెలా వచ్చాయి.. ఐదేళ్లకే నీకు నూరేళ్లు నిండాయా కన్నా..' అంటూ ఆ తల్లిదండ్రులు విలపించిన తీరు పలువురిని కన్నీళ్లు పెట్టించింది. ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలుడిని పాము కాటు వేయడంతో మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని గరిశలపల్లికి చెందిన మబ్బు నరేష్, లక్ష్మీ దంపతులకు యశ్వంత్ (5), హర్ష ఇద్దరు కుమారులు సంతానం. ఆదివారం మధ్యాహ్నం వరకూ ఇంటి వద్ద బాగా ఆడుకున్న యశ్వంత్ ఉన్నఫలంగా అపస్మారక స్థితిలోకి చేరాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే కుమారుడిని స్థానిక ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. విషపురుగు కరవడంతోనే అస్వస్థతకు గురై మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కుమారుడి మృతదేహం వద్ద తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు. సర్పంచు పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నారెడ్డి, నాగిరెడ్డి, ఈశ్వరయ్య, ఆంజనేయులు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంగీత కచేరి.. మురిసిన భక్తమది



సంగీత కచేరి నిర్వహిస్తున్న కర్ణాటక భక్తులు



కళాకారునికి సత్యసాయి చిత్రపటాన్ని బహూకరిస్తున్న రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ భక్తులు నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అలరించింది. పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి మందిరం చేరుకున్న ఉత్తర కర్ణాటక భక్తులు ఆదివారం రెండో రోజు కూడా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయిని కీర్తిస్తూ భక్తి గీతాలాపన చేయగా, 30 మంది కళాకారులు విభిన్న సంగీత వాయిద్య పరికరాలను వాయిస్తూ భక్తులను మంత్రముగ్ధుల్ని చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు దంపతులు కళాకారులకు సత్యసాయి చిత్రపటాలను బహూకరించారు.

రాయచూరు వాసి ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: కర్ణాటకలోని రాయచూరుకు చెందిన ధర్మేంద్ర(50) అనంతపురం నగర శివారులోని జీపీఆర్ లాడ్జీలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. చిన్న చిన్న కాంట్రాక్టు పనులతో జీవనం సాగించే ధర్మేంద్రకు అనంతపురంలోని రంగం పేట గోపాలరెడ్డి మిత్రుడు. ఈ నేపథ్యంలో మిత్రుడిని కలిసేందుకు వచ్చిన ఆయన తపోవనం కూడలిలో ఉన్న లాడ్జీలో దిగాడు. ఆదివారం మధ్యాహ్నం గదిలోకి వెళ్లిన ఆయన తిరిగి బయటకు రాకపోవడంతో బాయ్‌లు అనుమానంతో తలుపు తట్టి నిద్రలేపే ప్రయత్నం చేశారు. తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి యజమాని ద్వారా పోలీసులకు సమాచారం అందజేశారు. నాల్గో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద 'నా ఆస్తి నా భార్యకే చెందాలి' అని రాసిపెట్టిన ఉత్తరం లభ్యమైంది. సమాచారం అందుకున్న మృతుడి భార్య తాము వచ్చేంత వరకూ మృతదేహాన్ని అక్కడి నుంచి కదలించరాదని అభ్యర్థించింది. బాధిత కుటుంబసభ్యులు వచ్చిన తర్వాత ఆత్మహత్యకు కారణాలు వెల్లడయ్యే అవకాశముందని సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

విజేత ఇటుకలపల్లి



ట్రోఫీతో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఇటుకలపల్లి, సీకేపల్లి జట్ల క్రీడాకారులు



మ్యాచ్‌ను వీక్షిస్తున్న క్రీడాభిమానులు, ప్రజలు

- ముగిసిన సత్యసాయి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ
- పాల్గొన్న 190 జట్లు
- ఉత్కంఠగా సాగిన ఫైనల్

అనంతపురం: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 30 రోజులుగా కొనసాగిన సత్యసాయి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ విజేతగా ఇటుకలపల్లి జట్టు నిలిచింది. మొత్తం 190 జట్లు పాల్గొన్న ఈ టోర్నీని నిర్వాహకులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వచ్చారు. మే 23న ఎస్కేయూ వేదికగా టోర్నీ ప్రారంభమైంది. వరుసగా మ్యాచ్‌లు గెలుస్తూ ఫైనల్‌కు అనంతపురం జిల్లా ఇటుకలపల్లి, శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి జట్లు చేరుకున్నాయి.

కిక్కిరిసిన ఆర్డీటీ స్టేడియం

గతంలో ఎన్నడూ లేనంతగా క్రికెట్ మ్యాచ్ చూసేందుకు తరలి వచ్చిన సందర్శకులతో ఆర్డీటీ ప్రధాన స్టేడియం ఆదివారం కిక్కిరిసింది. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. తొలుత టాస్ గెలిచి చెన్నేకొత్తపల్లి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ చేసిన ఇటుకలపల్లి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 106 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చెన్నేకొత్తపల్లి జట్టు కేవలం 3.3 ఓవర్లలోనే 16 పరుగులకు 5 వికెట్లు కోల్పోయి క్లిష్ట పరిస్థితుల్లో కూరుకుపోయింది. అదే సమయంలో వర్షం రావడంతో మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. చివరకు రన్‌రేట్‌ను లెక్కించి ఇటుకలపల్లి జట్టును విజేతగా ప్రకటించారు. చెన్నేకొత్తపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన క్రీడాభిమానులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భోజన వసతి కల్పించారు.

క్రీడాస్ఫూర్తిని చాటిన టోర్నీ

ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. 30 రోజుల పాటు కొనసాగిన ఈ టోర్నీ క్రీడాస్ఫూర్తిని చాటిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు మెగా టోర్నీ నిర్వహించినట్లు వివరించారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. టోర్నీని చక్కగా నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ హాకీ జట్టులో జిల్లా క్రీడాకారులు



రాష్ట్ర జట్టుకు ఎంపికైన శ్రావణి, సింధు, నందిని

ధర్మవరం: ఒడిశాలోని రూర్కెలాలో ఈ నెల 27 నుంచి జరిగే 13వ జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టులో ధర్మవరానికి చెందిన క్రీడాకారులకు చోటు దక్కింది. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి సూర్యప్రకాష్ ఆదివారం తెలిపారు. జట్టుకు ఎంపికైన వారిలో శ్రావణి, సింధు, నందిని ఉన్నారు. ఏపీ జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులను జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, ఉడుముల రామచంద్ర, తదితరులు అభినందించారు.

దేశాభివృద్ధికి తోడ్పడాలి

- క్యాడెట్లకు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా పిలుపు



శిక్షణ పొందుతున్న క్యాడెట్లు

కూడేరు: దేశభక్తిని అలవర్చుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని క్యాడెట్లకు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ సందీప్ ముంద్రా పిలుపునిచ్చారు. కూడేరు మండలంలోని ఎన్‌సీసీ నగర్‌లో 6వ ఆంధ్రా బెటాలియన్ సీఏటీసీ-1 శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం క్యాడెట్లకు ఆప్టికల్ (అడ్డంకులను అధిగమించడం)పై, మ్యాప్ రీడింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాంప్ కమాండ్ మాట్లాడారు. కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాకు చెందిన 500 మంది క్యాడెట్లు, మేజర్ సుఖ్‌దేవ్, అధికారులు రాకేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఖాతాదారులకు అన్యాయం చేయం'

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఖాతాదారులకు అన్యాయం చేయబోమని ఆదరణ చిట్‌ఫండ్స్ యాజమాన్యం తెలిపింది. ఆదివారం అనంతపురంలోని ఆ సంస్థ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా సాగిస్తున్న చిట్ ఫండ్ వ్యాపారంలో డబ్బుకు బదులు హంపాపురం వద్ద వేసిన వెంచర్‌లో స్థలం రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నామన్నారు. 320 మంది ఖాతాదారులకుసొమ్ము చెల్లించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇదిలా ఉండగా ఓ విశ్రాంతి ఉద్యోగి మాట్లాడుతూ.. తనకు ఇవ్వాల్సిన రూ.25 లక్షలపై సీఐడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏడాది కాలంగా కార్యాలయం చుట్టూచుట్టూ తిరిగి వేసారి పోయినట్లు తెలిపారు.

పుట్టపర్తి వాసికి బెంగాలీ అవార్డు



కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్‌తో అవార్డు అందుకుంటున్న సాయికౌస్తుబ్

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తికి చెందిన సాయి కౌస్తుబ్ గుప్త బెంగాలీ అవార్డు అందుకున్నారు. పశ్చిమ బెంగాల్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్ణాటక ప్రభుత్వం మైత్రీ బంధన్ సభ్యులలో హిజ్ ఎక్సలెన్సీ పేరుతో ఆరుగురు బెంగాలీలను అవార్డులకు ఎంపిక చేసింది. వీరిలో పుట్టపర్తికి చెందిన సాయికౌస్తుబ్ గుప్త ఉన్నారు. వీరికి బెంగుళూరులోని రాజ్‌భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ అందజేసి, సత్కరించారు. కాగా, అరుదైన ఎముక వ్యాధి బారిన పడి 90 శాతం వైకల్యంతో బాధపడుతున్న సాయి కౌస్తుబ్... వీల్‌చైర్‌లో ఉంటూ భారతదేశాన్ని స్నేహపూర్వక దేశంగా మార్చేందుకు చేపట్టిన ప్రయత్నాలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ఇదే ఆయనకు దక్కడానికి కారణంగా తెలుస్తోంది.

మతిస్థిమితంలేని వ్యక్తి దుర్మరణం



రోడ్డుపై పడి ఉన్న రామానుజాచారి మృతదేహం

కనగానపల్లి: మండలంలోని పర్వతదేవరపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ముక్తాపురం గ్రామానికి చెందిన రామానుజాచారి (49) అనారోగ్య సమస్యతో పాటు మతిస్థిమితం లేక చుట్టు పక్కల గ్రామాల్లో తిరిగేవాడు. ఆదివారం మధ్యాహ్నం పర్వతదేవరపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా, బెంగుళూరు నుంచి అనంతపురానికి వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఘటనలో రామానుజాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనదారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై కనగానపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళుతున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన వాహనాన్ని ఆపి ఘటనపై ఆరా తీశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా నిలుస్తామని భరోసానిచ్చారు.

సీఆర్టీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

రాప్తాడు రూరల్: కేజీబీవీల్లో ఎస్ఓ, సీఆర్టీ పోస్టుల భర్తీలో భాగంగా సీనియార్టీ జాబితాలోని అభ్యర్థుల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఆదివారం పూర్తయింది. వీరిలో కొన్ని సబ్జెక్టులకు అభ్యర్థులు గైర్హాజరు కావడం, మరికొందరికి అర్హత లేకపోవడం వల్ల తొలగించారు. వారి స్థానాల్లో సీనియార్టీ జాబితాలో వారి దిగువన ఉన్న అభ్యర్థులకు సమాచారం అందించారు. దీంతో సోమవారం కూడా ఈ ప్రక్రియ సాగనుంది. సర్టిఫికెట్ల పరిశీలనను సమగ్ర శిక్ష ఏపీఓ సాయిరామ్ పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 280 ఎస్ఓ, సీఆర్టీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రతి పోస్టుకూ 1:3 నిష్పత్తిలో అభ్యర్థులు ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి





పొలంలో మృతి చెందిన శ్రీనివాసులు

ఓడీ చెరువు: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఓడీ చెరువు మండలం నల్లగుట్టపల్లికి చెందిన శ్రీనివాసులు(40)కు భార్య అక్కులమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. తనకున్న రెండు ఎకరాల పొలంలో వరి సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వరి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన మోటారు స్విచ్ ఆన్ చేసేందుకు స్టార్టర్ డోర్ తెరిచేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం నుంచి ఇంటికి భర్త రాకపోవడంతో భార్య వెళ్లి చూడగా స్టార్టర్ వద్ద పొలంలో విగతజీవిగా పడి ఉన్న శ్రీనివాసులు కనిపించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు అక్కడకు చేరుకుని మృతుడిని వెలికి తీశారు. ఘటనపై ఎస్ఐ గోపి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బస్సులో ప్రయాణికుడి మృతి

గుత్తి: కర్ణాటక బస్సులోఓ ప్రయాణికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహదేవ (29) బెంగళూరులోని ఓ ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం కర్ణాటక బస్సులో బెంగళూరు నుంచి ఆదోనికి బయలుదేరాడు. గుత్తి సమీపంలోకి బస్సు చేరుకుంటుండగా ఒక్కసారిగా సీటులోనే జారి కిందపడడంతో బస్సు డ్రైవర్, కండక్టర్ నేరుగా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

ఉరవకొండ: విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాల అటెండర్ రామాంజినేయులుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ హరినాథ్ తెలిపారు. అటెండర్‌కు సహకరించిన పాఠశాల సెక్యూరిటీ గార్డుపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘటనపై గుంతకల్లు డీఎస్పీ నర్శింగప్ప, సీఐలు హరినాథ్, శేఖర్ ఆదివారం విచారణ చేపట్టారు. బాధిత కుటుంబసభ్యులతో ఆరా తీశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులను కలసి వివరాలు సేకరించారు. కాగా, విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన అటెండర్‌ను అరెస్ట్ చేసి, విధుల నుంచి తొలగించాలంటూ ఎస్సీ, ఎస్టీ సంఘాలు, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. అటెండర్‌పై తగు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్రీడా కెరటం కీర్తన



- సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న కీర్తన
- అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



స్కూల్ గేమ్స్‌లో ఆల్‌రౌండర్ ప్రతిభను చాటుకున్న కీర్తనను అభినందిస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి (ఫైల్)

అనంతపురం: తన ముందున్న దారంతా కష్టాలు కనిపించాయి. అడుగడుగునా అవరోధాలు ఎదురయ్యాయి. ఎదుగుదలకు పేదరికం అడ్డుగోడలా మారింది. అయినా ఆమె వెనుకంజ వేయలేదు. ప్రతిభను నమ్ముకుని ముందుకు కదిలి విజేతగా నిలిచింది. సాఫ్ట్‌బాల్‌లో శ్రీసత్యసాయి జిల్లా ఆశాకిరణమై కనిపిస్తున్న కీర్తన క్రీడా ప్రస్థానమిది. తాజాగా అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఇటీవలే సొంతూరుకు తిరిగి వచ్చింది.

కష్టాలు.. కన్నీళ్లు..

నల్లచెరువు మండలం ఇందుకూరిపల్లికి చెందిన కీర్తన తల్లిదండ్రులిద్దరూ సన్నకారు రైతులే. చిరుప్రాయంలోనే తండ్రి ఎం.శ్రీనివాసరెడ్డి మృతిచెందాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ భారం మొత్తం తల్లి అనితపై పడింది. ఓ వైపు వ్యవసాయ పనులు సాగిస్తూనే మరో వైపు ఆశా వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణ భారాన్ని నెత్తికెత్తుకుంది. ఈ క్రమంలో చదువులు ఒక్కటే తమ పేదరికాన్ని దూరం చేస్తాయని విశ్వసించిన ఆమె.. ఆ దిశగా బిడ్డలను ప్రోత్సహిస్తూ వచ్చింది.

చదువులోనూ ఉన్నతమే.

కదిరిలోని బాలికల సంక్షేమ వసతి గృహంలో ఉంటూ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు కీర్తన చదువుకుంది. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 468 మార్కులతో ఉత్తీర్ణత సాధించి ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది. 6వ తరగతిలో ఉన్నప్పుడే సాఫ్ట్‌బాల్ క్రీడపై కీర్తన ఆసక్తి కనబరుస్తూ వచ్చింది. సమయం చిక్కినప్పుడల్లా 9 అంగుళాల బంతిని చేత పట్టుకుని పిచ్చింగ్ సాధన చేస్తూ వచ్చింది. ఆమెలోని ప్రతిభను పీఈటీలు సంధ్య, దానమయ్య గుర్తించారు. ప్రత్యేక శిక్షణతో ఆమెలోని నైపుణ్యాలను వెలికి తీశారు.

అమ్మ అండదండలతో..

సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న కీర్తనను చూసి తల్లి అనిత సంతోష పడింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం చదువులు ఒక్కటే ఉన్నతికి మార్గం కాదని భావించిన ఆమె క్రీడల్లోనూ రాణించాలంటూ కుమార్తెను ప్రోత్సహిస్తూ వచ్చింది. తల్లి ప్రోత్సాహం దక్కడంతో కీర్తన ఇక వెనుదిరిగి చూడలేదు. తన ఆటతీరుతో ఆర్డీటీ దృష్టిని ఆకర్షించింది. దీంతో క్రీడలో ఆమె మరింత పరిపూర్ణత సాధించేలా ఆర్డీటీ ప్రత్యేక శిక్షణ అందజేసింది. ఫలితంగా ఆరో తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడే అండర్-12 విభాగంలో హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకుంది. తొలి ఏడాదిలోనే జాతీయ స్థాయికి ఎదిగిన ఆమె.. ఆ తర్వాత వరుస విజయాలతో తన ప్రత్యేకతను చాటుకుంటూ వస్తోంది. 7వ తరగతి చదువుతున్నప్పుడు మధ్యప్రదేశ్‌లో జరిగిన మినీ నేషనల్స్, స్కూల్ గేమ్స్‌లో ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించింది. 2018లో అనంతపురంలో అనంత క్రీడాగ్రామం వేదికగా సాగిన సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్, జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పిచ్చర్‌గా, స్లగ్గర్‌గా తనకు ఎదురు లేదని నిరూపించుకుంది. 2019లో అనంత క్రీడాగ్రామంలో జరిగిన స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లోను, 2021లో విజయనగరం వేదికగా జరిగిన 8వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో తన ఆటతీరుతో జట్టును విజయతీరాలకు చేర్చింది. పదో తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడు సీనియర్ విభాగంలో స్కూల్ గేమ్స్, సౌత్‌జోన్, అండర్-15 ఉమెన్స్ ఏసియన్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో పాల్గొంది. ఏసియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో కీర్తన ఆట తీరు సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా చేసింది.



తైవాన్‌లో జరిగిన అంతర్జాతీయ మ్యాచ్‌లో ప్రత్యర్థి జట్టుపై బ్యాటింగ్ చేస్తున్న కీర్తన (ఫైల్)

ఫలించిన శ్రమ..

నిరంతర సాధనతో సాఫ్ట్‌బాల్‌లో రాణిస్తున్న కీర్తనకు అన్ని విధాలుగా ఆర్డీటీ దన్నుగా నిలిచింది. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఆమెకు వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి మరింత మెరుగులు దిద్దింది. ఈ నెల 13 నుంచి 17 వరకు తైవాన్‌లో జరిగిన అండర్-15 ఆసియా ఉమెన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన కీర్తన తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించి జట్టును విజయ తీరాలకు చేరుస్తూ వచ్చింది. తనను ఉన్నతశ్రేణి క్రీడాకారిణిగా తీర్చిదిద్దిన ఆర్డీటీకి జీవిత కాలం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా 'సాక్షి'కి కీర్తన తెలిపారు.